




# కరపత్రం

SINCE 2014

బుధవారం జనవరి 22 2025 | సంపుటి :0 | సంచిక : 101 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

**కమిషన్ ముందు హాజరైన ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు**

**రుణాలు, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపుపై ప్రశ్నలు**

**సుదీర్ఘంగా విచారించిన జస్టిస్ ఘోష్ కమిషన్**



కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలపై విచారణ సుదీర్ఘంగా కొనసాగింది. సంక్రాంతి సెలవుల తర్వాత తిరిగి మంగళవారం నుంచి కమిషన్ విచారణను ప్రారంభించింది. దాదాపు గంటన్నర పాటు రామకృష్ణారావును కమిషన్ విచారించింది.

2లో

## దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్‌లో జరిగిన సమావేశంలో సిఎంరేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ,అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు.




**కామారెడ్డిలో పామాయిల్ యూనిట్ ఏర్పాటు**

**తెలంగాణ ప్రభుత్వంతో యూనిలీవర్ ఒప్పందం**

## పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

**ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం**

**ఇలాంటి వారుని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం**



పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని,

2లో

## స్థిరాస్తి దళారిపై చేయిచేసుకున్న ఎంపీ ఈటల రాజేందర్



భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఓ స్థిరాస్తి దళారిపై చేయి చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఈ ఘటన చోటుచేసుకుంది. మున్సిపాలిటీలోని ఏకశిలానగర్‌లో మంగళవారం ఈటల పర్యటించారు. బాధితుల ఫిర్యాదుతో స్థిరాస్తి దళారిపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయనపై చేయిచేసుకున్నారు. ఇంటి స్థలాల యజమానులను ఇబ్బంది పెడుతున్నారని ఎంపీ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. "పేదలు కొనుక్కున్న జాగాలకు భాజపా

2లో

## జలసౌధలో కేఆర్ఎంబి సమావేశం.. హాజరైన ఏపీ, తెలంగాణ ఉన్నతాధికారులు




నగరంలోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)సమావేశం ప్రారంభమైంది. కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో తెలంగాణ, ఏపీ నుంచి జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు ఈ భేటీకి హాజరయ్యారు.
ఈ సమావేశంలో వివిధ అంశాలపై అధికారులు చర్చిస్తున్నారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల విడుదల, ఇప్పటివరకు వినియోగం, జలాశయాల్లో నిల్వలు, కృష్ణా పరీవాహకంలో టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు, సాగర్, శ్రీశైలం జలాశయాల ఆనకట్టల మరమ్మతులు, బోర్డుకు నిధుల కేటాయింపు, రెండు రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులపై పరస్పర ఫిర్యాదులు తదితరాలపై చర్చిస్తున్నట్లు సమాచారం.

## నిర్మాత దిల్ రాజు ఇళ్లు,

**కార్యాలయాల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు**



ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు చేస్తున్నారు.

2లో

## బిఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

**నగర మేయర్ విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం**

**ఎమ్మెల్యే తలసాని నివాసంలో కార్పొరేటర్ల భేటీ**

**హాజరైన నగర బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు**



బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో నగర ఎమ్మెల్యేలు దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే..

2లో

## తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామ సభలు

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు కొనసాగుతున్నాయి. 4 పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరించి గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 24 వరకు ఇవి కొనసాగనున్నాయి. గ్రామసభల్లో ప్రభుత్వ సంకల్పం, పథకాల వివరాలను ప్రజలకు తెలియజేసి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. గ్రేటర్‌లో కనిపించని వార్డు సభల నిర్వహణ
జీహెచ్ఎంసీ పరిధిలో వార్డు సభల నిర్వహణ కనిపించడం లేదు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డు సభలు మొదలు కాలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారుల సర్వే ఇంకా పూర్తి కాలేదు. గ్రేటర్‌లో సర్వే పూర్తయ్యాక ఫిబ్రవరి 1 నుంచి వార్డు సభలకు సన్నాహాలు చేస్తున్నారు.

## సంపాదకీయం

### యూజీసీ సంస్కరణల మంచీచెడూ!

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి 'కనీస బోధనా ప్రమాణాల' ముసాయిదా నిబంధనలు %-%2024ను తీసుకువచ్చింది. విద్యార్థులకు విద్యా సంబంధమైన విషయాల పట్ల మరింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించడం, నిబంధనలను సరళతరం చేయడం, ఏకరీతిగల విద్యా ప్రమాణాలు తీసుకురావడం, దేశీయ ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలతో అనుసంధానం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో ఈ నిబంధనలు రూపొందించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్, డీమ్డ్ ఉన్నత విద్యా సంస్థలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. దేశీయ ఉన్నత విద్యా సంస్థలు ఏ మేరకు ఈ సంస్కరణలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయో, వాటివల్ల ఒనగూరే ప్రయోజనాలు, సవాళ్ళు ఏమిటో ఇప్పుడు పరిశీలించాల్సి ఉంది.

సమర్థత గల విద్యా సంస్థల కోసం ప్రతిపాదించిన 'ద్వివార్షిక ప్రవేశాలు', విద్యార్థులకు సంవత్సరానికి రెండుసార్లు విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశాన్ని కల్పిస్తాయి. విద్యాసంస్థలలో పరీక్షల ఆలస్యం వలన గాని, వ్యక్తిగత, మరే ఇతర కారణాల వలన గాని ఏ విద్యార్థి అయినా విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రవేశం పొందలేకపోతే అలాంటి వారికి ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుంది. దేశీయ ఉన్నత విద్యాసంస్థల లోకి విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి, తద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించడానికి ఈ చర్య ఉపయోగపడడమే గాక దేశీయ ఉన్నత విద్యా సంస్థలు మెరుగైన గ్లోబల్ ర్యాంకులు సాధించడంలో తోడ్పడుతుంది. అయితే ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు లేక సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఈ విధానం ఏ విధంగానూ ఉపయోగం కాదు అనే విమర్శ కూడా ఉంది. ముఖ్యంగా అధ్యాపకుల పైన మరింత భారం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదించిన 'వికేంద్రిత విద్యార్థి హాజరు విధానం' వల్ల ఉన్నత విద్యా సంస్థలు వారు అందించే ప్రోగ్రాముల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల హాజరు విధానాలు నిర్ణయించుకునే స్వావలంబనను పొందుతాయి. ఈ విధానం వ్యక్తిగత హాజరు కంటే అభ్యాస ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచడంలో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన వినూత్నమైన బోధన విధానాలకు వెసులుబాటు కల్పిస్తుంది. అంతేగాక, ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ వంటి ప్రత్యామ్నాయ అభ్యాస పద్ధతులకు పెద్దపీట వేస్తుంది. అయితే, ఈ విధానం వల్ల విద్యా సంస్థల హాజరు విధానాల మధ్య సారూప్యత కొరవడి, విద్యార్థులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు గందరగోళానికి గురయ్యే అవకాశమూ ఉంది. విద్యాసంస్థలు హాజరు విధానాలు అతిసులభతరంగానో లేదా బాగా కఠినంగానో రూపొందించి ఆ విధంగా విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే అవకాశం ఉంది. హాజరుకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల అభ్యాసం, క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదిత 'బహుళ ప్రవేశ, నిష్క్రమణ విధానం' విద్యార్థులకు నిర్దిష్ట దశల వద్ద (సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ) ఒక ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కల్పించడమే గాక, వారి వ్యక్తిగత, ఆర్థిక, లేదా వృత్తిపరమైన అవసరాలను పూర్తి చేసుకున్న తరువాత కాలంలో తిరిగి ఆయా ప్రోగ్రాముల్లో ప్రవేశించేందుకు కూడా వీలు కల్పిస్తుంది. ఈ విధానం నిరంతర విద్యను ప్రోత్సహిస్తుంది. ఇది ముఖ్యంగా కార్మిక, పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనకరం. అయితే క్రెడిట్ బదిలీల నిర్వహణ, వివరమైన విద్యార్థి సంబంధిత రికార్డులను నిర్వహించడం, పాఠ్యాంశాలు ఏకరీతిని కొనసాగించడం వంటి అంశాలు పాలనా భారాన్ని పెంచుతాయి. గ్యాప్ తరువాత విద్యార్థులను తిరిగి సంఘటితం చేయడం కష్టం కావచ్చు. దీనికి సరిపోయే సరిసమాన కోర్సులు, మరీముఖ్యంగా నిష్ణాతులైన అధ్యాపకులను సమకూర్చుకోవడం తలకు మించిన భారం కాగలదు.

'భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు' ప్రవేశపెట్టాలన్న యూజీసీ ప్రతిపాదనను ఓ ప్రగతిశీల చర్యగా చెప్పవచ్చును. మూడు నుంచి నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, ఒకటి నుంచి రెండేళ్ళ పీజీ ప్రోగ్రాములను అందించడం ద్వారా, విద్యార్థుల విభిన్న అకడమిక్, ప్రొఫెషనల్, వ్యక్తిగత లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదే

మొదటిపేజీ తరువాయి

దాదాపు 24 ప్రశ్నలను రామకృష్ణను కమిషన్ చైర్మన్ పిసి ఘోష్ అడిగారు. రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ఆయనను ముందు ప్రశ్నలు ఉంచారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, లోన్స్, ప్రాజెక్టు డిజైనులు, బడ్జెట్ కేటాయింపు, వడ్డీల చెల్లింపులపై వంటి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్‌లు, బ్జడెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.కార్పొరేషన్‌కు నిధులు ఎలా వచ్చాయని కమిషన్ ప్రశ్నించింది. బడ్జెట్ కేటాయింపులు, లోన్స్ ద్వారా నిధులు సమకూర్చినట్లు రామకృష్ణారావు సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారన్న కమిషన్ ప్రశ్నకు.. పరిశ్రమలకు, ఇతర అవసరాలకు నీళ్లు అమ్మి రెవెన్యూ జనరేట్ చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని రామకృష్ణ చెప్పినట్లు సమాచారం. డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా అని రామకృష్ణను కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. డిజైన్లను అప్రూవల్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీతో ఎప్పుడూ సమావేశం కాలేదని, కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు రామకృష్ణారావు చెప్పారు. ప్రాజెక్ట్ తొందరగా కట్టారు కానీ నిబంధనలు పాటించలేదని కమిషన్ అడిగింది. అలాగే అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు పాలసీస్ పెట్టారా అని కమిషన్ ప్రశ్నించగా.. దానికి రామకృష్ణారావు తెలియదని సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టుకు సంబంధించిన్గ ÷ల్స్ ప్రాపర్‌గా కేబినెట్ ముందుకు రాలేదని.. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదని కమిషన్ అడిగింది. నిబంధనలు పాటించకుండా విడుదల చేసిన నిధుల రికార్డులను రామకృష్ణారావుకు కమిషన్ చూపించింది. ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులను సరిగా మెయింటెయిన్ చేయలేదని కమిషన్ ప్రశ్నించగా.. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గ్యారెంటీతోనే కార్పొరేషన్ లోన్స్ తీసుకుందని రామకృష్ణ తెలిపారు. 2024- 25గ÷నాన్షియల్ ఇయర్లో రూ.7382 ప్రిన్సిపల్ అమౌంట్‌కు రూ.6519 కోట్ల వడ్డీ చెల్లించామని ఆయన వెల్లడించారు. 9 నుంచి 10.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని కమిషన్‌కు రామకృష్ణా రావు తెలిపారు. కాగా.. గతంలోనే ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు, ఇంజనీర్లతో అఫిడవిట్‌లను తీసుకుంది కమిషన్. ఆ అఫిడవిట్‌లను ముందు పెట్టుకునే కమిషన్ బహిరంగ విచారణ చేస్తోంది. గత జూలైలోనే విచారణకు రావాల్సిందిగా రామకృష్ణారావుకు కమిషన్ నోటీసులు ఇచ్చింది.

# నిర్మాత దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు


మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపుపన్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. "ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం" అని ఆమె తెలిపారు.

# మమత తొందరపాటు చర్యలు సరికాదు: ఆర్జీకర్ మృతురాలి తండ్రి

ఇంటర్నెట్ డెస్క్: ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సర్కారు తీరును మృతురాలి తండ్రి తప్పుపట్టారు. ఈ వ్యవహారంలో సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు అవసరం లేదని అన్నారు .

"రేపు మాకు తీర్పు కాపీ వస్తుంది. దానిని పరిశీలించిన తర్వాత ఏమి చేయాలో నిర్ణయించుకుంటాం. అప్పటివరకు సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు తీసుకోకూడదు. ఆమె ఎన్నో మాటలు చెప్పి.. సాక్ష్యాలను తారుమారు చేశారు. వాటిని తారుమారు చేసిన వారిలో పోలీస్ కమిషనర్, ఇతరుల ప్రమేయం ఉంది. ఇవన్నీ మమత చూడలేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. సీబీఐ సరైన సాక్ష్యాధారాలు



సమర్పించలేకపోవడం వల్లే..స్థానిక కోర్టులో జీవిత ఖైదు పడినట్లు భావిస్తున్నామని వెల్లడించారు.

ఆర్జీకర్ వైద్యురాలి మృతదేహంపై మహిళ డీఎన్ఏ ఆనవాళ్లు..!

దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు కారణమైన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు న్యాయస్థానం సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మరణించే వరకూ జైలు జీవితం గడపాలని పేర్కొనింది. దోషికి రూ.50 వేల జరిమానా కూడా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది.

## పోలీస్ పహారా మధ్య గ్రామసభలు

మొదటిపేజీ తరువాయి

ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు.

## స్థిరాస్తి దళారిపై చేయిచేసుకున్న ఎంపీ ఈటల రాజేందర్

మొదటిపేజీ తరువాయి

కొందరు అధికారులు బ్రోకర్లకు కొమ్ముకాస్తున్నారు. భూములు కొనుక్కున్న పేదల సమస్యలపై కలెక్టర్, సీపీతో మాట్లాడాను. కొందరు దొంగ పత్రాలతో పేదల భూములను లాక్కుంటున్నారు. బ్రోకర్లకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలి. దళారులతో పోలీసులు, అధికారులు కుమ్మక్కవుతున్నారు. కూల్చివేతలు తప్ప.. పేదల కన్నీళ్లు పట్టించుకోవడం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చాం.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ఎవరు అధైర్యపడవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి అని, కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారికి కాంగ్రెస్ క్యాడర్ అండగా నిలబడాలన్నారు.

## దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది.

2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. లా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. రోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వారి సంఖ్య19కి చేరింది. మరోవైపు ఈ ఏడాది చివరల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్, బీజేపీలు సరి సమానంగా ఎంపీ స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు సైతం దక్కలేదు. అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం మేయర్ పీఠం హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిలతో సిద్దమవుతోన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జనవరి 22 2025

# రైతు సంక్షేమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం...

- పచ్చునూర్ లో గోదాం నిర్మాణానికి హామీ...
- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి....







**కరపత్రం శంకరపట్నం జనవరి 21**
రైతుల సంక్షేమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, అందులో భాగంగా రైతులను ఆదుకోవడానికి రుణమాఫీని అమలు చేశామన్నారు. రుణమాఫీతో లబ్ధిపొందిన వారిలో దేవంపల్లి గ్రామంలో 177 మంది రైతులు ఉన్నారని, వీరిలో లక్ష లోపు రుణమాఫీ పొందిన వారు 18 మంది, లక్షన్నర లోపు రుణమాఫీ పొందిన వారు 74 మంది, రెండు లక్షల రుణమాఫీ పొందిన వారు 85 మంది ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. ప్రతిష్టాత్మంగా అమలు చేయనున్న నాలుగు పథకాల్లో రైతులకు సంబంధించి రైతు భరోసా, రైతు కూలీలకు సంబంధించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు కూడా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.
సహకార వ్యవస్థ బలోపేతానికి సర్కారు చర్యలు..
గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సహకార వ్యవస్థను పటిష్టపర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి చెప్పారు. అందులో భాగంగా సహకార సంఘాల భవనాలు, గోదాముల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. శంకుస్థాపన చేసిన ఆరు నెలల వ్యవధిలో సంఘ భవనాలను నిర్మించి ప్రారంభోత్సవాలు చేసుకోవడం ముదావహమని పేర్కొంటూ సంఘ చైర్మన్, డైరెక్టర్లు అభినందనలు తెలియజేశారు. దేవంపల్లి సహకార సంఘం పరిధిలోని పచ్చునూరు గ్రామంలో కూడా గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లతా ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మ్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ కుమార్, కనుకం అశోక్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోండ్ల సురేశ్, ఇర్ఫాన్, వరాల చారి,టేకుమల్ల అంజయ్య, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య, సహదేవ్, ఆంజనేయులు, ప్రేమ్,శ్యామ్, నరేశ్, రాకేశ్ సొసైటీ పరిధిలో దేవంపల్లి, లలితాపూర్, పచ్చునూరు గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# అట్టహాసంగా ఏదులాపురం ఏఐకేఎస్ గ్రామ మహాసభ

- రైతుల పట్ల నరేంద్ర మోడీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు : దండి సురేష్
- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక






**ఖమ్మం రూరల్ కరపత్రం ప్రతినిధి:-**
ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్ ) గ్రామ మహాసభ సోమవారం రాత్రి అటహాసంగా జరిగింది. తొలుత అక్కడ డిబిఆర్ భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఏఐకే జెండాను సిపిఐ సీనియర్ నాయకులు మామిండ్ల నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. మిడ కంటి పెద వెంకట్ రెడ్డి , వెన్నం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడారు... ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు ఆదరువు కరువై ఆహార ఉత్పత్తులు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే రైతన్నకు అండగా నిలిచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఏఐకేఎస్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎదులాపురం గ్రామ ఏఐకేఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మిడకంటి పెద్ద వెంకటరెడ్డి, రామిడి రమేష్, అధ్యక్షునిగా మామిడి సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షునిగా బొడ్డు ఉపేందర్, సహాయ కార్యదర్శిగా ఘనపరపు వీరన్న, కార్యదర్శిగా వెన్నం భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎర్ర ప్రభాకర్, వేర్పుల రాములు కోట శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శులుగా బుద్ధి రాధాకృష్ణ ,బుద్ధి వెంకన్న ,ఉపాధ్యక్షులుగా వెంపటి సురేందర్ ,సహాయ కార్యదర్శిగా పొన్నెకంటి అఖిల్, సభ్యులుగా మామిండ్ల నిరంజన్ రెడ్డి ,నారపాటి రామారావు, గంధం రవి, మామిండ్ల నరేందర్ ,ఓరుగంటి రామారావు, దస్తగిరి ,తేలూరి వెంకన్న, శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ,రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బానోతు రామ్ కోటి ,పాలేరు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు ఎడ్లపల్లి శంకరయ్య, ఎదులాపురం-వరంగల్ క్రాస్ రోడ్ శాఖా కార్యదర్శులు వెంపటి సురేందర్, రామిడి రమేష్ ,యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ,ఘనపరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు...

# కోరుట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ ప్రారంభం.

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**




కోరుట్ల పట్టణంలో పెద్దలు మాజీ మంత్రివర్యులు జువ్వాడి రత్నాకర్ రావు గారి పేరు మీద కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు గారు స్పాన్సర్ చేస్తున్న "కోరుట్ల ప్రీమియర్ లీగ్" క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్ ప్రారంభించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ గారు.కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు గారు కోరుట్ల ఆర్డీవో జీవాకర్ గారు. మెట్ పల్లి డీఎస్పీ రాములు గారు.
అనంతరం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు గారు బౌలింగ్ చేయగా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ గారు బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్ ని ప్రారంభించారు.

# గ్రామాలలో ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తున్న కాంగ్రెస్ గ్రామ సభలు...

రామకృష్ణాపూర్ గ్రామ ప్రజల ఆవేదన..



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**
ప్రజా పాలన పేరుతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం గడిచిన పరిపాలన చేతగాని ప్రభుత్వంగా ముద్ర పడిపోయింది నేడు గ్రామసభల పేరుతో ప్రజలను మోసం చేసే దిశగా తెరలేపుతూ రాష్ట్రవ్యాప్తంగా 26వ తారీకు 4 పథకాలను ప్రారంభిస్తామని చెప్పి గ్రామసభలు నిర్వహిస్తూ, గ్రామాల వారీగా అధికారులతో సభలు నిర్వహిస్తూ, ప్రజలను అధికారులచే మోసం చేసే దిశగా పాలన కొనసాగుతుంది ప్రజాపాలన పేరుతో ప్రజలను ఇదిగో పథకం అదిగో పథకం అని ఆశ చూపుతూ సంవత్సరకాలం పబ్బం గడిపి కనీసం స్థానిక సంస్థ ఎన్నికలను కూడా నిర్వహించకుండా పాలను కొనసాగిస్తున్న తుగ్లక్ కాంగ్రెస్ ప్రభుత్వం గా ప్రజలు తీర్పును చెబుతున్నారని గ్రామాలలో ఆరు పథకాలకు అర్హులను గుర్తించకుండా అనర్హులను గుర్తించి గ్రామసభలు పెట్టి గ్రామాలలో గొడవలు సృష్టించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన కొనసాగుతుందని ఐక్యంగా ఉండే గ్రామాలను పథకాల పేరుతో వారి మధ్య దూరాన్ని పెంచే దిశగా పరిపాలన కొనసాగుతుందని మంగళవారం రామకృష్ణాపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభ పూర్తిగా అనర్హులకే పథకాలను అందే దిశగా అధికారుల యొక్క సర్వే ఉందని కనీసం అప్లికేషన్లకు సమయం ఇచ్చిన ప్రభుత్వం ఎలాంటి నిర్దేశాలను నియమాలను ఇవ్వకుండా మళ్లీ అప్లై చేసుకోవచ్చని చెప్పడం సిగ్గుచేటు పూర్తిగా అవస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించడంలో ప్రభుత్వం చొరవ చూపుతోందని గడిచిన సంవత్సరం కాలంలో ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తూనే వస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హరీష్ వర్మ అప్పని యార ఐలయ్య, రాజయ్య,అమ్మ అజయ్, గుండె హరీష్,అమ్మ సరోజన, రాదా, సుశీల, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రవాణా శాఖ ఉత్తర్వులు పాటించాలి..



- ఎస్ ఐ రవి...

**కరపత్రం శంకరపట్నం జనవరి 21**
ప్రతి ఒక్క వాహన దారుడు రవాణా శాఖ ఉత్తర్వులను పాటించి వాహనాలను నడపాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నంలో వాహనదారులకు ప్రజలకు రోడ్డు భద్రత పై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవి మాట్లాడారు వానహదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని, వాహనాలకు సంబంధించిన వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు వాహనం వెంట ఉంచుకొని పోలీసుల తనిఖీల్లో చూపించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని మహిళలు వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ప్రమాదానికి కారణమైతే చట్టాలు కఠినత్వంగా ఉన్నాయని, మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని ఆదేశించారు. ప్రతి వాహనదారుడు ప్రభుత్వ ఉత్తర్వులను నియమ నిబంధనలను పాటించి వాహనాలు నడిపి ప్రయాణికులతో పాటు వాహనదారుడు సురక్షితముగా గమ్యాలను చేరుకొని సుఖ సంతోషాలతో కుటుంబాలను పోషించుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను అవగాహన కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సదస్సులో పోలీస్ సిబ్బంది. గ్రామ ప్రజలు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముల పేటలో మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత..



- అమ్మ ఫౌండేషన్- మల్లారెడ్డిపల్లి

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**
వీణవంక మండలం శ్రీరాముల పేట గ్రామానికి చెందిన ఏరుకొండ సదయ్య సగర గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా, ఇట్టి విషయాన్ని కరీంనగర్ జిల్లా సగర సంగం ప్రధాన కార్యదర్శి కట్ట రాజు అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజుకు ఫోన్ ద్వారా తెలియజేయగా తక్షణమే స్పందించిన సమ్మన్న తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర ,శ్రీరాముల పేట గ్రామ అధ్యక్షుడు దేవునూరి రాజేందర్ సగర, మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు పల్లెర్ల కిరణ్ గుప్తా, సభ్యులు గంధం లక్ష్మణ్, వేణు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు , పెన్నులు పంపిణీ..

- జున్నూతుల రాఘవరెడ్డి ( పి ఎం సి ఎస్ ఓ ), అమ్మ ఫౌండేషన్.. మల్లారెడ్డిపల్లి..



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**
వీణవంక మండలంబొంతుపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు జున్నూతుల కౌసల్య స్మారకార్థం వారి 4 వర్ధంతిని పురస్కరించుకొని వారి భర్త జున్నూతుల నారాయణరెడ్డి, వారి కుమారుడు జున్నూతుల రాఘవరెడ్డి ప్రధానమంత్రి ముఖ్య భద్రత అధికారి, ఘన్ముకుల మోడల్ స్కూల్ లోని పదవ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ,పెన్నులు అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జున్నూతుల నారాయణరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ఉపాధ్యాయులు కిషన్ దాస్, బాలయ్య ,అరుణ,కిరణ్, శ్రీకాంత్, తిరుపతి, విజేందర్ రాజ్, చంద్రశేఖర్, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, సభ్యులు బండారి అనిల్, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
బుధవారం జనవరి 22 2025

# గ్రామ సభలలో గందరగోళం... అధికారులను నిలదీసిన లబ్ధిదారులు..

**– లిస్టుల లో పేదల పేర్లు గల్లంతు..**
**– నూతన దరఖాస్తులు స్వీకరించిన అధికారులు..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని కట్టుబడి, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు నాలుగు సంక్షేమ పథకాలను బృహత్తర కార్యక్రమంలో చేపట్టి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున పెద్ద ఎత్తున కార్యక్రమాల ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుంటే, అధికారుల నిర్లక్ష్యంతో పేద ప్రజల సంక్షేమ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితులను తెచ్చి పెడుతున్నారు.ప్రజాపాలన గ్రామసభలు మండలంలో మంగళవారం మల్లన్న పల్లి, కనపర్తి, రెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, హిమ్మత్ నగర్, రామకృష్ణాపూర్ , ఎల్బాక, బ్రాహ్మణపల్లి గ్రామాల నిర్వహించగా, గ్రామ సభలు లబ్ధిదారుల ప్రశ్నలతో గందరగోళంగా మారాయి. కొందరు




అధికారుల నిర్లక్ష్యం వల్ల, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభావం చూపన ఉందని, లబ్ధిదారులు మాట్లాడుతూ... ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీలో తప్పులు, కుల గణన సర్వేలో తప్పుల కారణంగా, ఇందిరమ్మ ఇండ్ల లిస్టులలో, నూతన రేషన్ కార్డుల లిస్టులలో అర్హులైన పేదల పేర్లు రాకపోవడంతో గ్రామ గ్రామాన దుమారం జరిగింది. గ్రామసభలలో అధికారుల లిస్టులు చదవక ముందే, గందరగోళ పరిస్థితి ఏర్పడగా,పోలీసుల సమక్షంలో గ్రామసభలు నడపాల్సిన పరిస్థితులు ఎలా ఉన్నాయి. లిస్టులలో పేర్లు రని లబ్ధిదారులు గ్రామ సభలలో మళ్లీ అర్జీలు పెట్టుకోవడం జరిగింది. కానీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపేదలు సంక్షేమ పథకాలను కోల్పోయే అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఎందుకంటే రెండు రోజుల ముందు అప్లై చేసుకుంటే, ఎంపిక ఇలా సాధ్యమవుతుందని , లబ్ధిదారులు ఆలోచనలో పడ్డారు. మండల వ్యాప్తంగా రాబోయే రెండు రోజుల్లో జరిగే గ్రామసభల్లోనైన పారదర్శకంగా అర్హుల లిస్టులను తయారుచేసి, ప్రభుత్వం కలలు కన్నా, పేదల సంక్షేమ కట్టుబడి ఉండాలని, నిరుపేదలు, ఆయా గ్రామాల ప్రజలు జిల్లా అధికారులను, మండల అధికారులను కోరుతున్నారు.

# శ్రీ రామాంజనేయ ఆలయానికి ఉత్సవ విగ్రహాలు అందజేత...

**– కరీంనగర్ ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్ రెడ్డి...**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**



వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాంజనేయ దేవాలయంలో ప్రతి ఏటా శ్రీరామనవమికి కళ్యాణ మహోత్సవం జరుపుటకు గాను శ్రీరాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కళ్లెపు వీరారెడ్డి– కాంతమ్మ దంపతులు వారి కుమారుడు కోడలు కళ్లెపు సంపత్ రెడ్డి–స్వర్ణలత (ఆంధ్రజ్యోతి దినపత్రిక కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్) మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఆంధ్ర జ్యోతి దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ సంపత్ రెడ్డి మాట్లాడుతూ..భగవంతుడు మాకు ఈ అవకాశాన్ని కల్పించడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వారీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచులు మేకల శ్రీనివాస్ రెడ్డి,మేకల ఎల్లారెడ్డి, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పల్లెర్ల కిరణ్ గుప్తా, గుమ్మడి సంపత్, కాంగ్రెస్ పార్టీ మల్లారెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నిమ్మల సమ్మయ్య ముదిరాజ్, గంధం సుమన్,బండారి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై అపోహలొద్దు...





**– అర్హులకే లబ్ధి చేకూరుస్తాం..**
**– ఎంపిక కాని అర్హుల అర్జీలు స్వీకరణ..**
**– గ్రామసభ అవరోధానికి బీఆర్ఎస్ నేతల యత్నాలు..**
**– ప్రతి ప్రశ్నకూ జవాబు చెప్పిన ఎమ్మెల్యే ..**
**– సందేహాల నివృత్తితో సభ నుంచి జారుకున్న గులాబీలు...**

**కరపత్రం శంకరపట్నం జనవరి 21**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలపై ఎలాంటి సందేహాలు వద్దని, అర్హులకే పథకాల ద్వారా లబ్ధిచేకూరుస్తామని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారు లను గుర్తించేందుకు నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సమాయత్త మైందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షలకు పెంపుతోపాటు రైతులకు రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుతో ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. గ్రామసభల్లో వెల్లడించే జాబితాల్లో పేర్లు లేని అర్హులైన నిరుపేదలకు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వారి అర్జీలను పున:పరిశీలించి తగు న్యాయం చేస్తామ న్నారు. ఈ పథకంపై పేదలు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయమన్నారు. అర్హులైన నిరుపేదలకు తప్పకుండా లబ్ధి చేకూరుస్తామని డాక్టర్ కవ్వంపల్లి హామీ ఇచ్చారు.రైతు కళ్లలో ఆనందం చూసేందుకే రైతు భరోసా రైతు కళ్లలో ఆనందాన్ని చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అందుకే రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల రూపాయల చొప్పు పెట్టుబడి సాయం అందించనున్నా మన్నారు. 26 నుంచి రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ కానున్నాయని ఆయన వెల్లడించారు.కొత్త రేషన్ కార్డుల జారీతో ఏళ్లనాటి నిరీక్షణకు తెర.గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా కొత్త రేషన్ కార్డుల పంపిణీతో ఏళ్లనాటి ప్రజల నిరీక్షణకు తెరపడనున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. తాజాగా రేషన్ కార్డుల పంపిణీతోపాటు పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఆయన చెప్పారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలకూ న్యాయం.రైతు కూలీలకు కూడా న్యాయం చేయాలనే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు.
గ్రామసభ అడ్డుకోవడానికి గులాబీల యత్నాలు.
లక్ష్మీపూర్ లో నిర్వహిస్తున్న గ్రామసభను అడ్డుకునేందుకు కొంత మంది బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. అయితే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ చేపట్టిన పథకాలపైన, ఎన్నికల హామీలపైన ప్రశ్నలు సంధించగా,సభలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి తగిన సమాధానాలు చెప్పారు.అంతే కాకుండా వారి సందేహాలన్నింటినీ ఆయన నివృత్తి చేయడంతో వికసించని గులాబీ లు సభ నుంచి జారుకున్నారు. ఈ గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారితోపాటు బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యాశాఖ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**– సామాజిక కార్యకర్త – గట్టు సాయిరాం**


**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 21**
హుజురాబాద్ మండల పరిధిలో గల ఏకశిలా , టెట్రా హెడ్రోన్ , మోంటెసరి, గ్రీన్ సైడ్జ్,కేరళ,న్యూ కాకతీయ పాఠశాలలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ నిబంధనలు పాటించకపోవడమే కాకుండా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు విద్యా బోధన సక్రమంగా లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు ఈ విషయంపై స్థానిక హుజురాబాద్ మండల విద్యాధికారి కి వినతి పత్రం అందజేయడం జరిగింది కావున తక్షణమే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకొని పాఠశాలలను సీజ్ చేయాలని కోరడమైనది లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

# ఏళ్లు గడుస్తున్న...కల్వల ప్రాజెక్ట్ పై కనికరం చూపని ప్రజా ప్రతినిధులు ...

**– సాగునీటి కోసం రైతులకు తప్పని తిప్పలు...**
**– సొంత ఖర్చులతో రెండవసారి తాత్కాలిక కట్ట మరమ్మత్తులు...**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 21.**



జమ్మికుంట,వీణవంక, కేశవపట్నం మండల రైతులకు సాగునీటి కల్పతరువుగా, వర ప్రసాదంగా పేరుగాంచిన కల్వల ప్రాజెక్ట్ గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం పెరిగి ముత్తడి పూర్తిగా ధ్వంసం అయింది. అప్పటినుండి రైతులు సొంత ఖర్చులతో ప్రతి పంట కోసం కరకట్ట నిర్మించుకొని సాగునీరును వాడుకుంటున్నారు. అలాగే రబీ సీజన్లో నవంబర్ మాసంలో రైతులు ఎకరాకి 1000 రూపాయల చొప్పున వసూలు చేసి, కరకట్ట నిర్మించుకోగా, ఎస్సారెస్పీ సాగునీరు ఆలస్యంగా ఉండడంతో, కల్వల ప్రాజెక్ట్ ఆధారిత రైతులు వీణవంక చెరువు నుండి సాగు నీటిని పంట పొలాలకు తరలించి వాడకం చేశారు. ఇటీవలే ఎస్సారెస్పీ నీటి విడుదల చేయడంతో కల్వల ప్రాజెక్ట్ లోకి నీరు రాగానే వారం రోజులు సంతోష సంబరాలతో పంటపొలాలకు సాగునీరును వాడుకున్నారు. కానీ,వ్యవసాయ ఆధారిత గ్రామాలైన కల్వల, కాచాపూర్,మల్లన్న పల్లె, బ్రాహ్మణపల్లి, వీణవంక, రామకృష్ణాపూర్, రెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, లస్మక్కపల్లి గ్రామాల రైతులు, కేశపట్నం ఎస్కేప్ వద్ద సాగునీటిని విడుదల చేయడంతో, ప్రాజెక్టులో నీరు ఎక్కువ చేరడంతో, కలువల ప్రాజెక్టులో నీటి నిల్వ కోసం వీణవంక రైతులు సొంత ఖర్చుతో నిర్మించుకున్న కరకట్ట తెగిపోవడంతో వారం రోజులుగా పంట పొలాలకు సాగునీరు లేక పంట పొలాలు నెర్రలు పారుతూ, పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపరించింది. మళ్లీ రెండవసారి వీణవంక రైతులు చేసేది ఏమీ లేక మళ్లీ ఎకరాకు 1000 రూపాయల చొప్పున వసూలు చేసి, కరకట్ట పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,ప్రజా ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే కలగజేసుకుని, కల్వల ప్రాజెక్ట్ పునర్నిర్మానం చేపట్టాలని ఆధారిత గ్రామాల రైతులు, కల్వల, వీణవంక గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

**– కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్...**

**కరపత్రం శంకరపట్నం జనవరి 21**
ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయ భవనంతోపాటు ఫంక్షన్ హాల్‌ను ఆయన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు.బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు తన్నీరు శరత్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు.ఆయా పథకాల ద్వారా లబ్ధిపొందడమే కాకుండా వాటి సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులందరికీ కనీస ఆదాయ మద్దతుగా ఏడాదికి రూ. 6,000 అందజేస్తారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారు. జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులంతా కలిసికట్టుగా ఉండటం వల్లనే ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల వరకు మాత్రమే




రాజకీయ పార్టీల మధ్య పోటీ ఉంటుందని, ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలపై అన్ని పార్టీలు ఏకమవుతాయన్నారు. వివిధ పార్టీల నాయకులతో కలిసి పనిచేసే విషయంలో తనకెలాంటి బేషజాలు లేవి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. సహకార సంఘాలు బలోపేతమైతేనే రైతులకు మేలు...ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతమైనప్పుడు రైతులకు మరింత మేలు జరుగుతుందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సహకార సంఘాలను పటిష్టపర్చుకునేందుకు సంఘ సభ్యులంతా సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. సహకార సంఘాలు ఆదాయ మార్గాలను ఎప్పటికప్పుడు అన్వేషిస్తూనే ముందుకు సాగాలన్నారు. ఆర్థికంగా బలోపేతమైనప్పుడే ఎదురయ్యే అవరోధాలను అధిగమించగలుగుతామని ఆయన పేర్కొన్నారు. సహకార సంఘాల నిధులను వెచ్చించడమే కాకుండా సంపద సృష్టిపైనా పాలకవర్గాలు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల అవసరాల మేరకు సహకార సంఘాలను విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా సహకార సంఘాల పాలకవర్గాలు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు.ఆదాయవనరులను సమకూర్చుకోవడంలో భాగంగా వాణిజ్య సముదాయాలతోపాటు ఫంక్షన్ హాల్ నిర్మించుకున్న సంఘ చైర్మన్ శరత్ రావును, సంఘ డైరెక్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యుడు తానిపర్తి భానుప్రసాద్ రావు, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్ దేవిశెట్టి శ్రీనివాస్ రావు, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.